క్లుప్తంగా

కార్తికేయుని సేవలో ఆర్టీసీ ఎండీ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు సతీష్ శర్మ, బాలకృష్ణ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చల్లపల్లి, అవనిగడ్డ సీఐలు భీమేశ్వర రవికుమార్, జి. శ్రీనివాస్, మోపిదేవి ఎస్ఐ పద్మ పాల్గొన్నారు.

విద్యార్థినికి చెక్కు అందజేత

నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది నిర్వహించిన ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షల్లో ప్రథమస్థానం సాధించిన భోగిరెడ్డి తేజశ్రీ (తుంగలవారిపాలెం)కు హైస్కూల్ పూర్వ విద్యార్థి శిష్టా వెంకటాచల మూర్తి రూ.10 వేల చెక్కును గురువారం అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ శిష్టా సుబ్రహ్మణ్యం-సుధారాణి దంపతులు, ఇన్‌చార్జి హెచ్ఎం బి.శివరామప్రసాద్, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్ల వితరణ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి మోపిదేవి కోస్టల్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ ఆర్. శ్రీనివాసరావు గురువారం డస్ట్‌బిన్లను అందజేశారు. ఉదయం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావుకు డస్ట్‌బిన్లను అందజేశారు. బ్యాంక్ సీఆర్ఓ ఎస్. నాగశివకృష్ణ, బ్యాంక్ సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

మోపిదేవి: మోపిదేవిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు అన్నారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు స్వామి వారి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. గురువారం స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు బ్రహ్మోత్సవాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అర్చకుడు బాలకృష్ణశర్మ, ఆలయ అధికారులు రామకృష్ణ, చెన్నకేశవ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు సాయం



కోడూరు: స్వతంత్రపురం గ్రామానికి చెందిన ఉప్పలపాటి శ్రీనివాసరావు నివాస గృహం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న కోడూరు వాసవీ కపుల్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాసరావు కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, గృహోపకరణలు, నూతన దుస్తులను అందించారు. శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తోట శ్యామ్ కిషోర్‌నాయుడు బాధితులకు రూ.5 వేల నగదును ఆర్థిక సహాయంగా అందించారు. ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, వాసవీ క్లబ్ కార్యదర్శి అరవపల్లి బుజ్జి, కోశాధికారి కోడూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు



కోడూరు: కోడూరు మెయిన్ ప్రాథమికోన్నత పాఠశాలను తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కాశీభొట్ల నాగభూషణం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ సర్వీస్ ఏర్పాటుపై హర్షం

మచిలీపట్నంటౌన్: గుడివాడ నుంచి మచిలీపట్నానికి రాత్రి 9 గంటలకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయడంపై జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. తాము కోరిన విధంగా ఈ సర్వీసు ఏర్పాటునకు కృషి చేసిన ఎమ్మెల్యే పేర్ని నాని, డిపో మేనేజర్ టి పెద్దిరాజుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం పెద్దిరాజును సత్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం, నగర అధ్యక్షుడు తోట బాబు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన

- మంత్రి జోగి రమేష్
- శీతనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



అడ్డపర్రలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి జోగి

కృత్తివెన్ను: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శీతనపల్లి గ్రామ పంచాయతీ అడ్డపర్ర, సంగమూడి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ గతంలో పాలన చేసిన ఏ ప్రభుత్వాలు ఇంతలా పేదల సంక్షేమం కోసం ఆలోచన చేయలేదన్నారు. ముఖ్యమంత్రి జగనన్న కుల,మత, పార్టీలకు అతీతంగా అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని చెప్పారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తోందని, దీనితో పాటు ఎవరికి రానటువంటి ఆలోచన ఓటీఎస్ ద్వారా ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్లు అందజేసిన ఘనత జగనన్నదేనన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేశారని చెప్పారు.

ఆర్‌బీకే కేంద్రాల ద్వారా రైతులకు మంచి సేవలు అందిస్తున్నారన్నారు. పలువురు పింఛన్లు, నివేశన స్థలాలు కావాలని కోరగా వెంటనే సంబంధిత అధికారులను పిలిచి వారి సమస్యలకు అక్కడే పరిష్కారం చూపారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు సునీత, మహాలక్ష్మీ, పార్టీ నాయకులు వాసు, విశ్వేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఈఓపీఆర్డీ మార్కండేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రైతు బాంధవుడు సీఎం జగన్

వేకనూరు(అవనిగడ్డ): రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. వేకనూరులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రైతుల మేలు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. రైతులు పండించిన పంట మిల్లర్లు, దళారులు పాలు కాకుండా ప్రభుత్వమే పీఏసీఎస్‌లు, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తోందని చెప్పారు. ధాన్యం తరలించేందుకు సంచులు, రవాణా, హమాలీ కూలీ అన్నీ ప్రభుత్వమే ఇస్తోందని వివరించారు. రైతుల సంక్షేమానికి ఇంతగా పరితపిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో ఎవరూ లేరన్నారు. ఈ సందర్భంగా ధాన్యం కాటా వేస్తున్న రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ వర్రే నరేష్, గ్రామ కన్వీనర్ తుంగల వేణుగోపాలస్వామి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మార్చిలోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు
- బందరు డిపో, గ్యారేజీ, డిస్పెన్సరీ పరిశీలన



బందరు బస్టాండ్ ఆవరణలో పర్యటిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఆర్టీసీ డిపో ఆధునికీకరణ పనులను మార్చిలోగా పూర్తి చేయాలని ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, గ్యారేజీ, డిస్పెన్సరీలను గురువారం ఆయన పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం ఆర్టీసీ డిపో ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం రూ. 3.5 కోట్లు మంజూరు చేసిందన్నారు. 2020 సంవత్సరంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా కరోనా కారణంగా పనులు వాయిదా పడ్డాయని చెప్పారు. 2022 ఆగస్టులో బస్టాండ్‌లోని ప్లాట్‌ఫారం విస్తరణ పనులు చేపట్టారన్నారు. ప్రస్తుతం కార్గో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఈ పనులు రానున్న 45 రోజుల్లో పూర్తికానున్నాయని, మిగిలిన పనులు మార్చి నెలాఖరు నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. పనులు త్వరితగతిన జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధి జగన్‌ను ఆయన ప్రశ్నించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. తొలుత ఆర్టీసీ డిస్పెన్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు కె. బ్రహ్మానందరెడ్డి, గిడుగు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణాధికారి గద్దె నాగేశ్వరరావు, డీఎం టి. పెద్దిరాజు, ఈఈ రాజశేఖర్, డీఈ జగదీష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ అప్పారావు, డాక్టర్ విజయసింగ్ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో రూ.8 కోట్ల లాభాలు

అవనిగడ్డ: సంక్రాంతి పండుగ అనంతరం రెండు రోజుల్లో ఆర్టీసీ రికార్డు స్థాయిలో రూ.8 కోట్ల లాభాలు ఆర్జించిందని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. అవనిగడ్డ ఆర్టీసీ డిపోను గురువారం ఆయన సందర్శించారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఆర్టీసీకి సంబంధించి రూ. 21.55 కోట్ల అప్పులు తీర్చామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు రూ.966 పీఎఫ్ బకాయిలు, రూ.269 సీసీఎస్ బకాయిలను చెల్లించామని చెప్పారు. అవనిగడ్డ ఆర్టీసీ డీఎం హనుమంతరావు డిపో ఆదాయం పెంచేలా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో 15 మంది డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులకు ఎండీ ద్వారకా తిరుమలరావు మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళి



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ రామ్మోహనరావు తదితరులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి గ్రంథాలయంలో గురువారం యోగి వేమన జయంతి కార్యక్రమం నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి ఎ. శాస్త్రి, గ్రంథ పాలకురాలు కోన వెంకటేశ్వరమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ యోగి వేమన లోక కవిగా, తాత్వికుడిగా తన అనుభవసారాన్ని పద్యరూపంలో సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా తేటతెల్లం చేశారన్నారు. వేమన పద్యాలు ప్రతి ఒక్కరు చదివి వారి జీవితాలకు అనుగుణంగా మలుచుకోవాలన్నారు.

● **గూడూరు:** ప్రజాకవి యోగి వేమన జయంతిని గూడూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

● **చిలకలపూడి(మచిలీపట్నం):** కృష్ణా విశ్వవిద్యాలయంలో యోగి వేమన జయంతిని గురువారం నిర్వహించారు. వేమన చిత్రపటానికి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె. రామ్మోహనరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సుమారు ఐదు వేల పద్యాలకు పైగా రచించిన ఆయన ప్రతి పద్యంలోనూ సమాజానికి నీతిని అందించిన మహనీయుడన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ రామిరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు సామాజిక చైతన్యాన్ని తెచ్చి పెట్టాయని చెప్పారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని హుబ్లీ, దార్వాడ్‌లో జరిగిన 26వ జాతీయ యువజనోత్సవాల్లో విశ్వవిద్యాలయం తరఫున పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శశిప్రణీత్‌రెడ్డి, అరుణ్ సందీప్, విజయ్, గౌరీప్రియ, మేఘనలను ప్రశంసాపత్రాలతో వీసీ అభినందించారు.

విజయవాడ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని మచిలీపట్నం-గుడివాడ సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనులు, గుంటూరు డివిజన్‌లో జరుగుతున్న ట్రాక్ మెయింటెనెన్స్ పనుల కారణంగా విజయవాడ డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్లను పూర్తిగాను, మరికొన్నింటిని పాక్షికంగాను రద్దు చేస్తున్నామని విజయవాడ డివిజన్ పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్తిగా రద్దు చేసిన రైళ్లు...

ఈ నెల 20 నుంచి 29 వరకు గుడివాడ-మచిలీపట్నం (07871) రైలు రద్దు చేశారు. ఈ నెల 20 నుంచి 30 వరకు గుడివాడ-మచిలీపట్నం (07868), మచిలీపట్నం-గుడివాడ (07869), గుడివాడ-మచిలీపట్నం (07880), ఈ నెల 20 నుంచి 22 వరకు విజయవాడ-గుంటూరు (07464), గుంటూరు-విజయవాడ (07465), విజయవాడ-గుంటూరు (07628) రైళ్లను పూర్తిగా రద్దు చేశారు.

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు..

ఈ నెల 20 నుంచి 30 వరకు మచిలీపట్నం-విజయవాడ (07899) రైలు మచిలీపట్నం-గుడివాడ మధ్య పాక్షికంగా రద్దు. అదే విధంగా విజయవాడ-మచిలీపట్నం (07898) రైలు పెడన-మచిలీపట్నం మధ్య, మచిలీపట్నం-విజయవాడ (07867) రైలు మచిలీపట్నం-పెడన మధ్య, విజయవాడ-మచిలీపట్నం (07866) రైలు మచిలీపట్నం-పెడన మధ్య, మచిలీపట్నం-విజయవాడ (07770) రైలు మచిలీపట్నం-పెడమ మధ్య, భీమవరం-మచిలీపట్నం (07898) రైలు పెడన-మచిలీపట్నం మధ్య, మచిలీపట్నం-గుడివాడ (07879) రైలు మచిలీపట్నం-పెడన మధ్య, విజయవాడ-మచిలీపట్నం (07895) రైలు పెడన-మచిలీపట్నం మధ్య, మచిలీపట్నం-విజయవాడ (07896) రైలు మచిలీపట్నం-పెడన మధ్య, మచిలీపట్నం-విజయవాడ (07870) రైలు మచిలీపట్నం-గుడివాడ మధ్య, విజయవాడ-మచిలీపట్నం (07769) రైలు పెడన-మచిలీపట్నం మధ్య పాక్షికంగా రద్దు చేశారు. ఈ నెల 20 నుంచి 22 వరకు గుంటూరు-రేపల్లె (07786) రైలును గుంటూరు-తెనాలి మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

23 నుంచి డీటీపీలో ఉచిత శిక్షణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పట్టాభి ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామీణ ప్రాంత యువతులకు ఉచితంగా డీటీపీ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువతులు శిక్షణ పొందవచ్చునన్నారు. 45 రోజుల పాటు కొనసాగే శిక్షణలో యువతులకు ఉచిత వసతి, భోజనం కల్పిస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం ద్వారా జారీ చేయబడిన ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు సెల్: 96031 63936 నెంబరుకు వాట్సాప్, ఫోన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చునని చెప్పారు.

ధ్యానానికి ఆదరణ

బంటుమిల్లి: ప్రపంచ వ్యాప్తంగా కుల, మత, లింగ, వయస్సు విచక్షతలకు అతీతంగా ధ్యానం బహుళ ప్రజాదరణ పొందిందని ఉత్తరాంచల్, రుద్రప్రయాగ, హిమాలయ యోగి సత్‌సదానందగిరి మహరాజ్ స్వామీజీ అన్నారు. స్థానిక కనకదుర్గ పిరమిడ్ ధ్యాన శక్తి క్షేత్రం వద్ద జరుగుతున్న మౌన ధ్యాన మహా యజ్ఞంలో భాగంగా గురువారం ఆయన పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. గుంటూరు ప్రాంతానికి చెందిన పిరమిడ్ కేంద్రాల నిర్వాహకులు వి. లక్ష్మణరావు, కె. విజయసారథి, బంటుమిల్లి పిరమిడ్ నిర్వాహకులు ఎస్. రేవతి, పి. వెంకటస్వామి పాల్గొన్నారు.

జనసేన దాడి ఘటనలో ఐదుగురు నిందితుల అరెస్ట్

పెడన: జనసేన పార్టీలోని ఇరువర్గాల దాడి ఘటనలో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని గుడివాడ డీఎస్పీ, మచిలీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్ సత్యానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న మధ్యాహ్నం పెడన-గుడివాడ జాతీయ రహదారిలోని నడుపూరు గ్రామ సమీపంలో కోళ్ల ఫారం వద్ద జనసేన పార్టీలోని రెండు వర్గాలు దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో యడ్లపల్లి రామసుధీర్ వర్గానికి చెందిన సింగంశెట్టి అశోక్ కుమార్, కొటారి మల్లిబాబు, మద్దాల పవన్‌లు కత్తిపోట్లకు గురై మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు పవన్ ఫిర్యాదు మేరకు సమ్మెట బాబు వర్గానికి చెందిన బత్తిన హరిరాంతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. దాడికి సంబంధించి కొండవీటి బాల హనుమాన్, కరకముద మురారి సాయి సత్యనారాయణ, తోటసాయితేజ, సుదగాని తిరుమలనాగ్, చిన్న ముత్తేవి హరిబాబును అరెస్ట్ చేసి కోర్టుకు పంపించారు.

రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

చిలకలపూడి(మచిలీపట్నం): మాండూస్ తుపాను కారణంగా గత నెలలో కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంట దెబ్బతిని ధాన్యం రంగు మారిందని, దీనిని మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె. శివనాగేంద్రరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డీఆర్వో వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. రంగుమారిన, నూకలైన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శీలం నారాయణరావు, వి. మరియదాసు, బీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల డ్రైవర్లకు నేత్ర వైద్య పరీక్షలు



మచిలీపట్నంటౌన్: ప్రైవేటు విద్యా సంస్థల వాహన డ్రైవర్లకు రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సిరి కల్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్యులు శిరీష, దివ్యరవళి డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. మచిలీపట్నం ప్రాంతంలోని 200 మంది డ్రైవర్లు కార్యక్రమానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాధికారి సీతాపతిరావు మాట్లాడుతూ 34వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. కంటి లోపం ఉన్న వారికి కళ్లద్దాలు, శస్త్ర చికిత్స అవసరమైన వారికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు చేయిస్తామని చెప్పారు. డీఎస్పీ కె. రమేష్‌బాబు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎండీఎల్ సిద్ధిఖ్, ఎస్ఎస్ నాయక్, సోనీప్రియ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ఎల్ఐసీ ఉద్యోగుల ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: జీవిత బీమా జాతీయకరణ దినోత్సవాన్ని స్థానిక ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద ఏఐఐఈఏ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీమా రంగాన్ని కాపాడుకుంటామంటూ ఎల్ఐసీ ఉద్యోగులు బ్యాడ్జీలు ధరించి ప్రతిజ్ఞ చేశారు. కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీని బలహీనపరిచే చర్యలకు పూనుకుంటోందని విమర్శించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పేరుతో కీలకమైన ఆర్థిక రంగంలోని ఎఫ్‌డీఐలను అనుమతించడం దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి చేటన్నారు. సంఘ నాయకులు జె. సుధాకర్, జి. కిషోర్‌కుమార్, ఎల్. రాజశేఖర్, ఠాగూర్, డి. శ్రీనివాస్, ఎస్‌వీ రత్నారావు, ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలతో మంచి ఫలితాలు

అవనిగడ్డ: మామిడిలో పూత, పిందె దశలో రైతులు సస్య రక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రేవతి చెప్పారు. మామిడిలో వచ్చు తెగుళ్లు, చీడపీడలపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడిలో పూత, పిందె దశలో వచ్చే చీడపీడలు, తేనెమంచు పురుగు, తామర పురుగు, మసి తెగులు, బూడిద తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను వివరించారు. ఉద్యానవన శాఖాధికారి చందు జోసఫ్ సుందరం, వ్యవసాయ సలహా మండలి జిల్లా కార్యవర్గ సభ్యుడు సామర్ల రామచంద్రరావు (రాముడు), వ్యవసాయ సహాయకురాలు తనూజ, రైతులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



వెలివోలు(చల్లపల్లి): వెలివోలులో బొల్లా శ్రీనివాసరావుకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గురువారం దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం.. విద్యుత్ షార్క్ సర్క్యూట్ వల్ల శ్రీనివాసరావుకు చెందిన గృహానికి మంటలు వ్యాపించాయి. ఇటీవలే ధాన్యం విక్రయించగా వచ్చిన రూ.1.88 లక్షలు, ఇంటిపైకప్పు రేకు వేసుకునేందుకు దాచుకున్న లక్ష రూపాయలు, 16 గ్రాముల బంగారం, వెండి వస్తువులు కాలిపోయాయి. మువ్వ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంతో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు కట్టు బట్టలతో మిగిలారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నాగాయలంక: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపాలెం గ్రామానికి చెందిన వాకా లంకేశ్వరరావు (40) ఈనెల 12వ తేదీ నాలుగు గంటల సమయంలో అతని మిత్రులు నంద్యాల రాంబాబు, అవనిగడ్డకు చెందిన పుట్ట శ్రీను స్వాములతో కలిసి శబరిమలకు వెళ్లారు. 15వ తేదీన తిరుగు ప్రయాణం అయినట్లు భార్యకు సమాచారం ఇచ్చాడు. తెనాలి వరకు వచ్చిన ఆయన ఇంటికి చేరలేదు. అతనితో వెళ్లిన వారంతా ఇళ్లకు చేరారు. వారి నుంచి భర్త సమాచారం ఏమీ తెలియకపోవడంతో లంకేశ్వరరావు భార్య వాకా నాగలక్ష్మి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది.

ఆటో ఢీకొని నలుగురికి గాయాలు

చల్లపల్లి: చల్లపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నానికి చెందిన వేముల దీపిక, వేముల కార్తీక్, వేముల వెంకటేశ్వరరావు తెనాలిలో బంధువుల పెళ్లికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా చల్లపల్లిలోని వైన్‌షాపుల సమీపంలో జాతీయ రహదారిపై మచిలీపట్నం నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ముగ్గురు వ్యక్తులతో పాటు ఆటో డ్రైవర్ మద్దాల సూర్యప్రకాశరావుకు గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో మచిలీపట్నం తరలించారు.

23న కన్యకాంబ ఆత్మార్పణ మహోత్సవం

నాగాయలంక: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23న కన్యకాంబ అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జై వాసవీ గ్రూపు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు కృష్ణా నది నుంచి తెచ్చిన 108 బిందెల జలంతో, 108 కిలోల బియ్యంతో తొలుత అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పంచామృత, పసుపు, కుంకమలతో అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. 11.30 గంటలకు అష్టోత్తర సహస్రనామ కుంకుమార్చన, సామూహిక వాసవీమాత పారాయణం, 12.30 గంటలకు నీరాజన మంత్రపుష్పం, రాత్రి 7.30 గంటలకు అమ్మవారి పవళింపు సేవ జరుగుతుందని వివరించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



సముద్రతీరంలో లభించిన మోహనరావు మృతదేహం

నాగాయలంక: గుల్లలమోద గ్రామానికి చెందిన తమ్ము మోహనరావు (39) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17వ తేదీన మోహనరావు ఆరుగురితో కలిసి సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు బోట్ నుంచి జారిపడిపోయాడు. మత్స్యకారులు వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మత్స్యకారులతో కలిసి గాలింపు చేపట్టగా మోహనరావు మృతదేహం గురువారం లభించింది. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వలంటీర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు



గూడూరు: ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టుల భర్తీకి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. గూడూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో 9 మంది వలంటీర్ల నియామకం చేపట్టి వారికి నియామకపు పత్రాలు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గూడూరు: మల్లవోలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సభ్యురాలై ఇటీవల మృతిచెందిన విన్నకోట శకుంతల కుటుంబానికి పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. చైర్మన్ దాసరి రమేష్, సర్పంచి బొర్రా సాంబశివయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని జార్జికార్నేషన్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలికల సంరక్షణ అంశంపై వక్తృత్వ, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను బందరు డీవైఈఓ యూవీ సుబ్బారావు ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవం

మచిలీపట్నంటౌన్: సర్కిల్‌పేట ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవం గురువారం జరిగింది. ఫాదర్ లాం జయరాజు దివ్య పూజబలిని నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ వి. జోజిబాబు, పలు విచారణల ఫాదర్లు, సిస్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ సంబరం



గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన గంగానమ్మ సంబరం గురువారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో అమ్మవారు వీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.